క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ

ఉదయగిరి: మహానాడులో చంద్రబాబు సీఎం జగన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు, అమరావతిలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చడాన్ని నిరసిస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలిగిరి మండలం నుంచి ఉదయగిరి వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మతల్లికి పొంగళ్లు



చంద్రారెడ్డిపాళెంలో పోలేరమ్మతల్లికి పొంగళ్లు పెడుతున్న మహిళలు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ చంద్రారెడ్డిపాళెం గ్రామదేవత పోలేరమ్మతల్లికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా పోలేరమ్మతల్లి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పెట్టారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నారు. రాజుపాళెం, జువ్విగుంటపాళెంలో కూడా పోలేరమ్మ తల్లికి పొంగళ్లు పెట్టారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం



ఎమ్మార్పీఎస్ మర్రిపాడు మండల కమిటీ సభ్యులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మర్రిపాడు మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మర్రిపాడులో ఆ సంఘ సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా బి సత్యయ్య, ఉపాధ్యక్షులుగా ఆదిమూర్తి, చిన్న సుబ్బరాయుడు, కోశాధికారిగా ఆనందరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.చెన్నారాయుడు, కార్యదర్శులుగా శ్రీను, పెంచలయ్య, హరి, రమణయ్య, వెంకటరత్నం, వెంకటయ్య, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బెల్లంకొండ గోపి మాదిగల అభ్యున్నతికి చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు.

వాటర్ ప్లాంట్ పునరుద్ధరణకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



గ్రామస్తులకు చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: మండలంలోని పెరమన పంచాయతీ జంగాలదొరవులోని వాటర్‌ప్లాంట్ పునరుద్ధరణకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సొంత నిధులు రూ.లక్ష అందజేశారు. గ్రామస్తులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకురావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో సమస్యపై చర్చించి ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా రూ.లక్ష అందజేశారు.

గంగమ్మతల్లికి పొంగళ్లు

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం సోమశిల గౌతమ్ బుద్ధనగర్‌లో గంగమ్మతల్లికి ఆదివారం పొంగళ్లు సమర్పించారు. మహిళలు డప్పు వాయిద్యాలతో పొంగళ్ల గంపలతో వెళ్లి గంగమ్మ తల్లి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ ఆత్మకూరు నియోజకవర్గం కార్యదర్శి బల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహనా సదస్సు

కావలి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా ఆరోగ్య అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ దస్సులో మహిళల రుతుక్రమం, అపోహలు తదితర అంశాలపై అవగాహన కలిగించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు మంజూరుకు సీఎంకు వినతి

ఉదయగిరి: ఉదయగిరి-నందవరం సింగల్ రోడ్డును డబుల్ రోడ్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్పి ఎస్దానీ, ఉదయగిరి ఉపసర్పంచ్ షేక్ ముర్తూజాహుస్సేన్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం పంపించారు. జిల్లా కేంద్రానికి వంద కిలో మీటర్ల దూరంలో ఉండే ఉదయగిరి నుంచి నెల్లూరు వెళ్లాలంటే సుమారు 30 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. అత్యవసర సమయాల్లో ఈ మార్గంలో నెల్లూరుకు పోవాలంటే రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన



లబ్ధిదారుకు అందించిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- గాంధీజనసంఘంలో గడప గడపకు మన ప్రభుత్వం

సంగం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంగం మండలం పడమటిపాళెం సచివాలయం పరిధిలోని గాంధీజనసంఘంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక సర్పంచ్ మానికల చందన్ కుమార్, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలతో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ చక్రంతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి గ్రామస్తులకు సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీకేటీ పట్టాలు అందజేయాలని, పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పాలనతో మన రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. పడమటిపాళెం సచివాలయం పరిధిలో ఇప్పటి వరకు సంక్షేమం, అభివృద్ధి కింద 2,471 మంది లబ్ధిదారులకు రూ.12.67 కోట్లు అందజేసినట్లు వివరించారు. ఇంతటి సంక్షేమాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలంతా నడిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికలు ఎంతో కీలకమైనవని, రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయం సాధించేలా అందరం సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

అబ్బురపరిచిన టెలిస్కోప్

ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి బాలయోగి సైన్సు పరిశోధన కేంద్రం నిర్వాహకుడు, ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం టెలిస్కోప్ చూపించారు. మొబైల్ వాహనం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో ఆరు వేల మంది విద్యార్థులకు చంద్రుడిని చూపించినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. 400 ఏళ్ల నాడు కనిపెట్టిన టెలిస్కోప్‌ను ఇప్పటి వరకు అందరూ సరిగా చూడలేదని, నియోజకవర్గంలో అన్ని మండలాల్లో విద్యార్థులకు దీనిని చూపించి అవగాహన కల్పించాలని ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ను ఎమ్మెల్యే కోరారు. అనంతరం పర్వతారోహకుడు దివంగత మల్లి మస్తాన్‌బాబు కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆయన వెంట జెడ్పీటీసీ రావుల లక్ష్మి ప్రసాద్‌గౌడ్, తహసీల్దారు లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ గోపి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, పడమటిపాళెం సర్పంచ్ బాలకృష్ణారెడ్డి, గంగపట్నం శేఖరయ్య, ఫణికుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంచల రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జహంగీర్, శంకరయ్య, శ్రీధర్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు సంక్షేమ వారధులుగా నిలిచారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 40 వార్డుల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయా వార్డుల్లోని వలంటీర్లను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ల సేవలు దేశం దృష్టిని ఆకర్షించాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలను పేదలకు చేరువ చేయడంలో, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తించడంలో, కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. ప్రతి నెలా ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛన్లు అందించడంతో పాటు లబ్ధిదారులు స్థానికంగా లేకపోతే పక్క జిల్లాలకు కూడా వెతుక్కుంటూ వెళ్లి మరీ పింఛన్లు అందించడంలో వలంటీర్లు చూపిస్తున్న సేవాభావం ప్రజల్లో ప్రత్యేక గుర్తింపును తెచ్చి పెట్టిందని వివరించారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు చూసిన ఇతర రాష్ట్రాలు కూడా తమ రాష్ట్రాల్లో వలంటీర్ల విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుండడం వలంటీర్లకు గర్వకారణమని తెలిపారు. వలంటీర్లు ఇదే తరహాల్లో మరిన్ని సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



దుత్తలూరు: వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు,అధికారులు

వలంటీర్ల సేవలు మరువలేనివి

దుత్తలూరు: వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి తెలిపారు. దుత్తలూరులో ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడడంలో వలంటీర్లు కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. సేవామిత్ర, సేవారత్న పురస్కారాలను వలంటీర్లకు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్సై బాజిరెడ్డి, ఎంపీడీఓ సాయిప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ చేజర్ల చలమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ మీసాల రమాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

దేశంలోనే వలంటీర్ల వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- వలంటీర్లకు వందనం కార్యక్రమం



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ల వ్యవస్థకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, నిస్వార్థంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్న సేవలకు కొలమానం లేదని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంగం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా నిస్వార్థంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో సేవ చేస్తున్న వలంటీర్ల వ్యవస్థను అందరూ కొనియాడుతున్నారన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీలు మాత్రం అక్కసు వెళ్లగక్కుతున్నాయన్నారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ప్రధానంగా విద్య అవసరమన్నారన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో మనకందరికి తెలుసునని గుర్తు చేశారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ భావి తరాల భవిష్యత్తుకు బంగారుబాట వేస్తున్నారన్నారు. వైద్యానికి మరింత ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించే విలేజ్ క్లినిక్‌లను సైతం ఏర్పాటు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఇద్దరు వలంటీర్లు ఇటీవల హఠాన్మరణం చెందితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5 లక్షల వంతున అందజేశామన్నారు. ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి వలంటీర్ తన పరిధిలోని ప్రజలకు తెలియచేసి, సంక్షేమ ముఖ్యమంత్రిని మరోమారు గెలిపించుకునేందుకు సమష్టిగా పనిచేయాలన్నారు. అనంతరం సంగం మండలంలో సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను ఆయన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, ఎంపీడీఓ గోపి, తహసీల్దారు లక్ష్మీప్రసన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఇందిర, సీనియర్ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి, పీపీసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ముడి మల్లికార్జునరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు దేవసహాయం, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, చంద్రారెడ్డి, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరి ధనుంజయరెడ్డి



మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

సీతారామపురం: రాష్ట్రంలో కులం, మతం, రాజకీయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరి ధనుంజయరెడ్డి అన్నారు. ఆదివారం సీతారామపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నాడు–నేడుతో పాఠశాలల రూపు రేఖలే మారిపోయాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడమే కాకుండా, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారంటే ఆ ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఇతర రాష్ట్రాల్లోనూ ప్రజలు వైద్యం చేయించుకుంటున్నారంటే ప్రజల ఆరోగ్యంపై ఎంత శ్రద్ధ వహిస్తున్నారో తెలుస్తుందన్నారు. దివ్యాంగులు, వితంతు, వృద్ధులకు ప్రతి నెల 1వ తేదీన తెల్లవారు జామునే పింఛన్ ఇంటికి తెచ్చి ఇస్తున్నారని, గతంలో ఇలా జరిగిందా అని గుర్తు చేసుకోవాలన్నారు. సీతారామపురం మండలం మెట్ట ప్రాంతమని ఎక్కడా ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రాంతానికి సాగు నీరు, తాగునీరు పుష్కలంగా ఉన్నప్పుడే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శాయశక్తులా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరు రాజు, రామిశెట్టి తిరుపతయ్య, పాముల రమణయ్య, గోరంట్ల తిరుపాలు, చంద్రమౌళి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం తగ్గిద్దాం

- ఎంవీఐ రాములు



వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆత్మకూరు ఎంవీఐ రాములు

ఆత్మకూరు: వాహనదారులు ఎక్కడైనా ఆగినప్పుడు తమ వాహనాల ఇంజిన్ ఆపడం ద్వారా వాతావరణ కాలుష్యం తగ్గేందుకు దోహదం చేసిన వారవుతారని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.రాములు సూచించారు. ఆదివారం నెల్లూరుపాళెం సెంటర్‌లో ఆటో వాలాలు, మ్యాక్సీ వ్యాన్ డ్రైవర్లు, వాహనదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల వల్ల ఏర్పడే కాలుష్యం కొంత మేర అయినా తగ్గించేందుకు డ్రైవర్లు సహకారం తప్పనిసరి అన్నారు. పర్యావరణం కాపాడడంలో సహకరించాలని కోరారు. ట్రాఫిక్ ఎక్కువ సేపు నిలిచిన సందర్భాల్లో వాహన ఇంజిన్ ఆపు చేయాలని ఆయన సూచించారు. ఆ మేరకు వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం

- నేలకొరిగిన భారీ వృక్షాలు



గాలీవాన ధాటికి పడిపోయిన విద్యుత్ స్తంభం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం గుంపర్లపాడులో ఆదివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. పెను గాలులకు వంద ఏళ్ల నాటి వృక్షాలు నేలకొరిగాయి. పంచాయతీలోని గొల్లపేట, రెడ్డిపాళెం, పాతూరుల్లో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభాలు విరిగి కింద పడ్డాయి. దీంతో గ్రామంలో అంధకారం ఏర్పడడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. రేకుల ఇళ్ల కప్పులు ఎగిరిపోయాయి. విద్యుత్ సౌకర్యం పూర్తిగా నిలిచిపోవడంతో పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూరిగుడిసె, గడ్డివామి దగ్ధం

- రూ.1.50 లక్షల ఆస్తి నష్టం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

ఆత్మకూరు: పట్టణంలోని అనంతరాయని గిరిజన కాలనీలో ఆదివారం అగ్నిప్రమాదంలో పూరిగుడిసెతో పాటు గడ్డివామి దగ్ధమయ్యాయి. తిరుమలశెట్టి రత్నమ్మ పూరి గుడిసెలో నివసిస్తోంది. పక్కనే తిరుమలశెట్టి బుజ్జమ్మకు చెందిన గడ్డివామి ఉంది. వీరి ఇళ్లకు సమీపంలోనే పొలాలు ఉన్నాయి. పొలాల వద్ద కంపను తగలబెడుతుండగా ఆ మంటలు తొలుత గడ్డివామికి, తర్వాత పూరిగుడిసెకు అంటుకున్నాయి. పక్కనే ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటార్లు కాలిపోయాయి. ఈ ఘటనలో రూ.1.50 లక్షల నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారి రమేష్ ఆధ్వర్యంలో మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనా స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, ఏఈ జె.ప్రసాద్, వార్డు ఇన్‌చార్జి కొప్పోలు చిన్నప్పరెడ్డి తదితరులు పరిశీలించారు.

ఎమ్మెల్యేని కలిసిన రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని 2024 ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రతి ఒక్కరు సమష్టిగా కృషిచేయాలని ముఖ్యంగా యువత సేవా కార్యక్రమాలతో ప్రభుత్వ సంక్షేమఫలాలు అందరికి అందేలా కృషి చేయాలన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



మర్రిపాడులో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న యువకులు

ఆత్మకూరు: దివంగత నందమూరి తారకరామారావు 100వ జయంతి సందర్భంగా ఆత్మకూరులో ఆదివారం ఆయన అభిమానులు పట్టణంలోని బీఎస్ఆర్ సెంటర్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. చలన చిత్ర రంగంలో, రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అల్పాహారం అందజేశారు.

మర్రిపాడులో..

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు, తిక్కవరంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో, తిక్కవరంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. తిక్కవరంలో ఆయా కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకులు ముప్పాళ్ల వెంకట్, చంద్రబాబు, హర్ష, నాగేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ ఈదురు గాలులు, వర్షం



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభం

చేజర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండతో అల్లాడిన ప్రజలకు ఉపశమనం లభించింది. మండలంలోని ఏటూరు వద్ద తాటిచెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు చెట్టును పక్కకు లాగడంతో వాహనాలు కదిలాయి. చేజర్ల, తిమ్మాయిపాళెం మధ్య విద్యుత్ స్తంభం పడిపోయింది.

వణికిస్తున్న వరుస చోరీలు

- నెలలో 20కి పైగా దొంగతనాలు
- నేరాల నియంత్రణలో విఫలమవుతున్న పోలీసులు



రెండు రోజుల క్రితం గౌరవరంలో దొంగలు ధ్వంసం చేసిన బీరువా

కావలి: కావలిలో వరుస చోరీలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పట్టణ నడిబొడ్డు నుంచి శివారు ప్రాంతాల వరకు దొంగలు చెలరేగిపోతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా, ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నా చిల్లర దొంగలను కూడా పోలీసులు పట్టుకోలేకపోతుండడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. పట్టణంలో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట దొంగతనాలు నమోదవుతూనే ఉన్నాయి. 30 రోజుల వ్యవధిలో సుమారు 20 దొంగతనాలు జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత నెల 16వ తేదీ వేకువన పట్టణంలోని అత్యంత భద్రత ఉండే బృందావనం కాలనీలో చోరీ జరిగిన నాటి నుంచి వరుసగా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. బృందావనం కాలనీలో సుమారు రూ.70 లక్షల సొత్తు చోరీకి గురైన విషయం తెలిసిందే. సాక్షాత్తు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి స్వయంగా పర్యవేక్షించినా ఇంత వరకు కేసు ఒక కొలిక్కి రాలేదు. ఆ తర్వాత వరుసగా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల పట్టణ నడిబొడ్డులోని ట్రంక్‌రోడ్డులో దుకాణాల్లో వరుస చోరీలు జరిగాయి. వీటిల్లో సీసీ టీవీ ఫుటేజీలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నా.. దొంగను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. నాలుగు రోజుల క్రితం ముసునూరులో దొంగలు చెలరేగిపోయారు. తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో తలుపులు, బీరువాలు పగులకొట్టి నగలు, నగదు చోరీ చేశారు. ఈ ఘటనలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసే లోగానే గౌరవరంలో మరో చోరీ చోటు చేసుకుంది. గౌరవరం గ్రామానికి చెందిన గడ్డం శేషారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బయట నిద్రిస్తుండగా దొంగలు దర్జాగా ఇంట్లో చోరీ చేశారు. 10 సవర్ల బంగారు, రూ.55 వేల నగదుతో పాటు గతంలో నగదు కుదవ పెట్టిన రసీదులు కూడా ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో కనీసం ఎస్సై స్థాయి అధికారి కానీ, క్లూస్ టీం కానీ ఆధారాలు సేకరించేందుకు కూడా ప్రయత్నించలేదు. వరుస చోరీలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నా పోలీసులు కనీస చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన లేని అధికారులు

నేరాల నియంత్రణ, కట్టడి, ముందస్తు చర్యల్లో అవగాహన లేని పోలీసు అధికారుల కారణంగా చోరీలు ఒక కొలిక్కి రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే కావలిలో నేరాల శాతం కాస్త అధికంగానే ఉంటుంది. రైల్వే, హైవే కనెక్టివిటీ ఉండడం, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు జిల్లాలకు చెందిన నేరస్తులు ఎక్కువగా కావలిలో చోరీలకు పాల్పడిన ఘటనలు గతంలో చాలా ఉన్నాయి. కావలిలో కూడా చోరుల సంఖ్య అధికంగానే ఉంది. పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచకపోవడం, ఇన్ఫార్మర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయడం, క్రైం సిబ్బంది తక్కువగా ఉండడంతో కావలిలో నేరాల అదుపులోకి రావడం లేదని పోలీసు వర్గాల్లోనే వినిపిస్తుంది. ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకుని నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.